క్లుప్తంగా

చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

టేకులపల్లి: కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి చికిత్స అందించారు. ఈ సందర్భంగా పిల్లలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అమర్ సింగ్, వార్డెన్ నాగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, ఏఎన్‌ఎంలు రమాకుమారి, వెంకటరమణ, స్టాఫ్ నర్స్ సునీత, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చత్రపతినాథ్‌కు రజత పతకం


చత్రపతినాథ్‌తో ప్రిన్సిపాల్

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం ధన్‌బాద్ గ్రామ పంచాయతీలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిచత్రపతినాథ్ ఈనెల 7,8 తేదీలలో భూపాలపెల్లిలో తెలంగాణ వింటర్, ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ స్విమ్మింగ్ పోటీలలో బట్టర్ ఫ్లై విభాగంలో రజిత పతకం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థిని మంగళవారం పాఠశాలలో అభినందించారు.

సమాధులకు స్థలం కేటాయించండి..

పాల్వంచరూరల్: ఏళ్ల తరబడి క్రైస్తవుల సమాధుల తోటకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ స్థలం కేటాయించాలని క్రైస్తవ పాస్టర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాతో తహసీల్దార్ వివేక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి సాయిబాబా, పాస్టర్ జాన్వేల్సన్, కొత్తపల్లి రవి, జాన్సన్, వరహాల రాజు, గాబ్రియల్, లోక పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సుజాతనగర్: కొత్తగూడెం కోర్టులో ఈ నెల 14 వరకు జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ఎం.రమాదేవి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... రాజీకి అనుకూలమైన యాక్సిడెంట్, దాడి, చీటింగ్, వివాహ బంధాలు, దొంగతనం, గుట్కా, పేకాట వంటి క్రిమినల్, సివిల్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని, ఈ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారం అయితే కోర్టు ఫీజులు వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాజీమార్గం రాజమార్గమనీ, చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పుస్తకాల బహూకరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి విద్యాసంస్థలోని విద్యార్థులకు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మంగళవారం పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను కొంతకాలంగా సేకరించిన ఎన్నో పుస్తకాలు, డిక్షనరీలు, ఎస్ఎస్‌సీ పుస్తకాలు, ఒలంపియాడ్, అట్లాస్, తెలుగు, జేఈఈ, అకాడమిక్ పుస్తకాలను విద్యార్థులకు అందజేయటం ఆనందంగా ఉందన్నారు. సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద, ఏ.దేవకి, డాక్టర్ జి.శైలజ, హైస్కూల్ హెచ్‌ఎం ఏ.సాయి సుజాత, ఒలంపియాడ్ సమన్వయకర్త డి.ఫూల్‌సింగ్, ఎస్.ప్రసన్న, శ్రీలత, రమాదేవి పాల్గొన్నారు.

అర్బన్ పార్క్ వెలవెల..

- రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మాణం
- ఏడాదిన్నర క్రితం అట్టహాసంగా ప్రారంభం
- సౌకర్యాల ఏర్పాటు మరిచిన అధికారులు


సోములగూడెం రోడ్డులో ఫారెస్ట్ అర్బన్ పార్క్ ముఖద్వారం

పాల్వంచరూరల్: ప్రకృతిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, ఆహ్లాదానికి పట్టణాలకు సమీపంలో తెలంగాణ హరితహారం నిధులతో అటవీశాఖ అధికారులు రూ.1.44 కోట్ల వ్యయం చేసి అర్బన్ పార్క్ ఏర్పాటు చేశారు. కానీ సందర్శకులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పార్క్ వెలవెలబోతోంది. మండల పరిధి బస్వతారకకాలనీ పంచాయతీలోని సోములగూడెం రోడ్డులో 250 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 22, 2023 అప్పటి ఎమ్మెల్యే వనమా ప్రారంభించారు. పార్క్ ముఖ్యద్వారం, లోపల చెట్ల మధ్యలో నుంచి 5 కిలోమీటర్ల పొడువు వాకింగ్ ట్రాక్, ఊటచెరువు, పార్క్ చుట్టు ఇనుప కంచె, 16 ర్యాక్ ఫీల్ చెక్‌డ్యామ్‌లు, సోలార్‌పంప్ సెట్‌ను మాత్రం ఉన్నాయి. ప్రతీరోజు వాకింగ్‌కు వచ్చే వారికి, సందర్శనకు వచ్చే వారికోసం కనీసం కూర్చునేందుకు బల్లలు, కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు.

సిటీకి దూరంగా...

అర్బన్ పార్క్ సిటీకి దూరంగా పాల్వంచ మండలంలోని బస్వతారకకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో ఏడాదిన్నర క్రితం అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో సిటీ ప్రజలు పార్క్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పార్క్ సమీపంలో ఉన్న వీరునాయక్‌తండా, లక్ష్మీదేవిపల్లి, బస్వతారకకాలనీ, బిక్కుతండా గ్రామపంచాయతీలకు చెందిన గ్రామీణ ప్రాంతాల ప్రజల కూడా ఆసక్తి చూపడం లేదు.

రూ.కోట్లు నిరుపయోగం...

రూ.1.44 కోట్లు వ్యయం చేసి ఏర్పాటు చేసిన అర్బన్ పార్క్ నేడు అలంకారప్రాయంగా మారిందని స్థానికులు అంటున్నారు. పార్క్ ఏర్పాటు సమయంలో చెట్లు తప్ప పూలమొక్కలు లేవు, సందర్శకులకు ఆహ్లాదం కల్పించే సౌకర్యాలు కల్పించలేదు. దీనికి తోడు సిటీగా దూరంగా ఉండటం, అసలు అక్కడ సందర్శకుల కోసం అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు సిటీ, చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాలకు తెలిసేందుకు ప్రచారం కొరవడంతో అర్బన్ పార్క్ నేడు అలంకారప్రాయంగా మారింది.

టికెట్ కౌంటర్ ఏర్పాటు...

అర్బన్ ఫారెస్టు పార్క్‌ను సందర్శించేందుకు అటవీశాఖ అధికారులు టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు కానీ సందర్శకులకు కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో ఆయా కౌంటర్లు నిరుపయోగంగా మారాయి. పార్క్ ఏర్పాటు చేసి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ పార్క్ ముఖద్వారం వద్ద పార్క్‌ను తెలియజేసే బోర్డు కానీ, సంబంధిత అధికారుల పేర్లు తెలియజేసే సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.


పార్క్‌లో వాకింగ్ ట్రాక్

సౌకర్యాలు కల్పించాలి...



ఫారెస్ట్ అర్బన్ పార్క్‌లో సందర్శకులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎవరూ పార్క్‌కు రావడం లేదు. అంతేకాకుండా లోపల అడవి తలపించే విధంగా ఉండటం వలన కూడా అందులోకి వెళ్లాలంటే సందర్శకులు భయపడే పరిస్థితి ఉంది. గుబురుగా చెట్లు, రాలిన ఆకులు, రాళ్లు ఉన్నాయి.

– మున్నాలాల్, బస్వతారకకాలనీ

లైటింగ్ ఏర్పాటు చేయాలి...



అర్బన్ పార్క్‌లో వివిధ రకాల మొక్కలు, చిల్డ్రన్ పార్క్, సందర్శకులు సేద తీరేందుకు ప్రత్యేక బల్లలు, కుర్చీలను ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో కూడా తిలకించే విధంగా లైటింగ్, తాగునీటి సౌకర్యం కల్పించాలి. టికెట్ లేకుండా సందర్శకులను అనుమతించాలి.

– సత్యనారాయణ, కమ్మరిగూడెం

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తాం..



పార్క్ సిటీకి దూరంగా ఉండటం ఒక కారణమైతే, ముఖద్వారం ప్రధాన బీసీఎం జాతీయ రహదారి వైపు కాకుండా సోములగూడెం రోడ్డు వైపు ఉండడంతో ఎవరూ రావడం లేదు. లోపల టాయిలేట్లు, ఫ్రెషర్ ట్రాక్‌ను ఏర్పాటు చేశాం. ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేస్తాం.

– కట్టా దామోదర్‌రెడ్డి, ఎఫ్‌డీఓ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం..


కొబ్బరికాయ కొట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్, సీతంపేట బంజర గ్రామాల్లో సుమారు రూ.7 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రహదారులు, ఎంఆర్‌సీ భవన నిర్మాణాలకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పాల్వంచ, కొత్తగూడెం మండలాల్లో ఇంటర్, డిగ్రీ కళాశాల మరమ్మత్తులకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సుజాతనగర్ మండలంలో ఇంటర్ కళాశాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, రాబోయే విద్యాసం వత్సరం నాటికి కళాశాల ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. కళ్యాణ మండపానికి స్థలం ఇచ్చేందుకు దాతలు ముందుకొచ్చారని, నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు పట్టాలు అందజేయాలని, 600 గ్రాముల ధాన్యాన్ని అదనంగా కాంటా పెడుతున్నారని, హమాలీ ఖర్చులను ప్రభుత్వమే ఇవ్వాలని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాగా సీతారాములు, సోషల్ వెల్ఫేర్, పీఆర్ డీఈలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, తహసీల్దార్ జి.శిరీష, ఎంపీడీఓ బి.భారతి, ఎంఈఓ ఎల్ లీలా, ఏఓ జి.నర్మద, నాయకులు చింతలపూడి రాజశేఖర్, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు, కొమారి కృష్ణ, బొడ్డు కేశవరావు, మూడు గణేష్ పాల్గొన్నారు.

పిల్లలు బడిలో.. తల్లిదండ్రులు పనిలో ఉండాలి


మాట్లాడుతున్న కీర్తిచంద్రికారెడ్డి

ఇల్లెందురూరల్: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలి.. తల్లిదండ్రులు మాత్రమే పనులకు వెళ్లాలని ఇల్లెందు ప్రిన్సిపల్ జడ్జి దేవరపల్లి కీర్తిచంద్రికారెడ్డి అన్నారు. బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఉచిత నిర్బంధ చట్టం అమలులో ఉన్నందున మైనర్లను, విద్యార్థులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని చెప్పారు. భారత పౌరులకు రాజ్యాంగం మాట్లాడే స్వేచ్ఛ, పని స్వేచ్ఛ వంటి హక్కులు కల్పించిందని, వాటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అతిక్రమిస్తే శిక్షార్హులు అవుతారని చెప్పారు. సదస్సులో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు కొండ నారాయణ, వెంకటేశ్వర్లు, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా సమాజానికి హక్కులే పునాది



మాట్లాడుతున్న సత్యనారాయణ

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో మానవుల స్వేచ్ఛ, మనుగడకు హక్కులే పునాది అని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా వ్యక్తిగత భద్రతతో జీవించే హక్కును కలిగి ఉన్నాడన్నారు. స్వేచ్ఛ, సమానత్వం అనే నినాదంతో స్వేచ్ఛగా బతకాలనే ఉద్దేశంతో మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటామని చెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే ప్రజాజీవనం ప్రమాదంలో పడుతుందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను తెలుసుకొని స్వతంత్రంగా, ప్రశాంతంగా జీవించాలని పేర్కొన్నారు. అందరూ హక్కులకు భంగం కలిగించకుండా నడుచుకోవాలన్నారు. చట్టాలపైన కనీస పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మెండు రాజమల్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్, న్యాయవాదులు రామారావు, మదన్ మోహన్, బి.మంగీలాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధిద్దాం..


మాట్లాడుతున్న కౌన్సిలర్ పద్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన మహిళా డ్వాక్రా గ్రూపు సంఘాల ద్వారా మహిళలకు పొదుపు ఆవశ్యకత తెలిసిందని, వాటి ద్వారానే మహిళా సాధికారత సాధించామని 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ అన్నారు. మదర్‌థెరిస్సా సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళా అభ్యున్నతికి ప్రయత్నం చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో స్త్రీశక్తి భవనాలను నిర్మించాలని, మహిళలు వ్యాపార రంగాలలో రాణించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో సీఓ శాంతకుమార్, షబానా, ఆర్‌పీ బానోత్ స్వర్ణ, భారతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

జూలూరుపాడు: జూలూరుపాడు సహకార సంఘం ఆధ్వర్యంలో పాపకొల్లులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వరి ధాన్యం కొనుగోళ్లపై రైతులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. సన్న రకానికి క్వింటాకు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. జూలూరుపాడు ఏఓ దీపక్ ఆనంద్, బానోత్ నవీన్, రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం..


మాట్లాడుతున్న డాక్టర్ మురళి

ఇల్లెందురూరల్: క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు అందరూ సహకరించాలని రొంపేడు వైద్యాధికారి డాక్టర్ కవిత, డాక్టర్ మురళి కోరారు. రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సబ్‌సెంటర్‌లో మంగళవారం క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. దేశావ్యాప్తంగా 347 జిల్లాల్లో క్షయ వ్యాధి తీవ్రంగా ఉందని, అందులో కొత్తగూడెం జిల్లా ఒకటిగా ఉందన్నారు. క్షయవ్యాధిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడటం, మెడ చుట్టు, సంకలో గడ్డలు వంటివి క్షయ వ్యాధి లక్షణాలని చెప్పారు. ఆయా లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీని సంప్రదించి మందులు వాడాలని.. వ్యాధి నిర్ధారణ అయిన వారికి నెలకు రూ.1000 చొప్పున ప్రోత్సాహకం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాజు, శంకర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక


వెంకటేశ్వర్లు


యాకూబ్‌పాషా

పాల్వంచ/పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాల్వంచ మండలం దంతెలబోరు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు మల్లెంపాటి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎన్నిక జరిగింది. అదేవిధంగా జిల్లా కార్యదర్శిగా తోగ్గూడెం పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షేక్.యాకూబ్ పాషాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, సౌకర్యాల కల్పనకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఓపెన్ కోటాలో దుకాణాల కేటాయింపు

ఇల్లెందు: పట్టణంలోని లలిత కళామందిర్ రోడ్డులోని 14 గదులు ఓపెన్ కేటగిరిలో కేటాయించనున్నామని, ఆసక్తి కలిగినవారు పొందవచ్చని ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నాలుగుసార్లు ఓపెన్ ఆక్షన్ పద్ధతిలో టెండర్లు ఆహ్వానించగా 10, 13 షాపులకు మాత్రమే అగ్రిమెంటు జరిగిందని తెలిపారు. మిగిలిన 14 గదులకు ఎవరూ రానందున ఓపెన్ కేటగిరిలో కేటాయించాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మానించిందని పేర్కొన్నారు. రూ.వెయ్యి చెల్లించి కొటేషన్ పొందాలని, ఈ నెల 16 లోపు వచ్చిన వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9666333359 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంవీటీసీని సందర్శించిన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని మైన్స్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)ని మంగళవారం రక్షణ వారోత్సవాల కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మాట్లాడుతూ... ఎంవీటీసీలో ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, ఉద్యోగులు పని స్థలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ రక్షణతో ఎలా పనిచేయాలో అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఎంవీటీసీ మేనేజర్‌కు రక్షణ వారోత్సవ కమిటీ సభ్యులు అడిగిన విషయాలను సంబంధిత అధికారులకు వివరించి 55వ రక్షణ వారోత్సవ కమిటీ సభ్యుల ద్వారా ఏరియా మొదటి బహుమతి పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు గట్టయ్య, రక్షణ వారోత్సవాల కమిటీ కన్వీనర్ జీవీ కోటిరెడ్డి, కమిటీ సభ్యులు ఇందా విజయ్‌సింగ్, ఎంవీటీసీ మేనేజర్ జి.లక్ష్మణ్, అధికారులు కలవల చంద్రశేఖర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న ఇఫ్టూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, చేస్తున్నామని అసెంబ్లీలో తీర్మానం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు సంజీవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని బంగ్లోస్ ఏరియాలో ఏరియా నాయకులు శంకర్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్దాలుగా సింగరేణిలో చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారని వాపోయారు. పోరాటాలతో రూ.5 వేల బోనస్ సాధించుకున్నామని అదే స్ఫూర్తితో పర్మనెంట్ అయ్యే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 18 రోజుల సమ్మె కాలంలో ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి మేము అధికారంలోకి వస్తే పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చి నేడు నోరుమెదపటం లేదని, ప్రస్తుత రెండు రోజులుగా సాగుతున్న అసెంబ్లీ శీతాకాల సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేస్తున్నట్లు తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చేసిన 75 జీఓలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి , సతీష్, మంగ, పద్మ, ముత్తమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో ఆటలు వద్దు.. గ్రౌండ్‌లో ఆడండి..


ఇల్లెందు: కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఇల్లెందు: నేటితరం విద్యార్థులు ఫోన్‌లో ఆటలు మానేసి గ్రౌండ్‌లో ఆడితే జీవితానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కె.రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం సీఎం క్రీడా పోటీలు జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభింఇచ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జేకే శ్రీనివాస్, ఎంఈఓ స్వామి, హెచ్‌ఎంలు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం ధన్‌బాద్ గ్రామ పంచాయతీలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో సీఎం కప్ మండల లెవల్ టోర్నమెంట్‌ను మంగళవారం పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ పి.కృష్ణ, ఎంపీఓ కే.సత్యనారాయణ, మండల విద్యాధికారి బి.బాలాజీ, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మండల ప్రత్యేక అధికారి రుక్మిణీదేవీ జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. క్రీడలు మానసికోల్లాసం, శరీరదారుఢ్యం , ఐక్యమత్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంఈఓ బి.జుంకీలాల్, ఎంపీఓ తులసీరామ్, జూలూరుపాడు, పాపకొల్లు హైస్కూల్స్ హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, ఎస్కే మీరా సాహెబ్, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టేకులపల్లి: టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడా పోటీలను మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్ నాయక్, ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, తహసీల్దార్ నాగభవాని, ఎంపీఓ జేఎల్ గాంధీ పర్యవేక్షించారు. విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడి సందడి చేశారు.

పాల్వంచ: విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీనివాస కాలనీ క్రీడా ప్రాంగణంలో మున్సిపాలిటీ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధానం ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రత్యేక క్రీడా యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎస్.పరంధామరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేలా చర్యలు తీసుకోవడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, సెక్రటరీ కె.మహీధర్, వైస్ ప్రెసిడెంట్ వై.వెంకటేశ్వర్లు, పీడీలు నగేష్, రాము, చిన్న బాబూరావు, సుందరమ్మ, నాని, శ్వేత, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై నిరసన


ఇల్లెందు: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిష్కరించిన విగ్రహం తెలంగాణ తల్లి విగ్రహం కాదని, ముమ్మాటికి కాంగ్రెస్ తల్లి విగ్రహంగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బానోతు హరిసింగ్ నాయక్, వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ అన్నారు. మంగళవారం ఇల్లెందులో బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపులో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి మీద కక్షతో సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని మార్చి ప్రజలను గందరగోళానికి గురి చేశాడని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రాష్ట్ర ప్రజలు తెలంగాణ తల్లిగా గుర్తించారని తెలిపారు. ఏడాది క్రితం ఎన్నికలకు ముందు 420 వాగ్దానాలు ఇచ్చి మాయమాటలతో గద్దెనెక్కి అడ్డదారుల్లో కాలం గడుపుతున్నాడని ఆరోపించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయంలో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మను లేకుండా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో లకావత్ దేవీలాల్ నాయక్, అజ్మీరా భావ్‌సింగ్‌నాయక్, ఎస్.రంగనాథ్, దాస్యం ప్రమోద్‌కుమార్, పరుచూరి వెంకటేశ్వరరావు, కె.రేణుక, అబ్దుల్ నబీ, జబ్బార్, గిన్నారపు రాజేష్, పోషం, భూక్యా సురేష్, నెమలి ధనలక్ష్మి, సరిత, పూదారి లక్ష్మీనారాయణ, పూనెం కమల, మల్హార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ... కాంగ్రెస్ నిరంకుశ పాలనకు సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, బాదావత్ శాంతి, అన్వర్‌పాషా పాల్గొన్నారు.

పాల్వంచ: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం రాజకీయం చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

మాట్లాడుతూ.. విగ్రహాల మార్పు చర్యలు మానుకోకపోతే ప్రభుత్వంపై పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో కిలారు నాగేశ్వరరావు, కాంపెల్లి కనకేష్, కనగాల బాలకృష్ణ, మల్లెల శ్రీరామ్మూర్తి, ఎస్‌పి నాయుడు, వీరునాయక్, విజయ్, చందు నాయక్, సింధు తపస్వీ, మంజుల, సమ్మయ్య గౌడ్, నవీన్, శివ, హర్ష, యాకేష్, హరి తదితరులు పాల్గొన్నారు.